కథావేదిక

# మిగిలిన ప్రశ్న

- ఉత్పల వరదరాజ

జగన్నాధం నాకు ఈమధ్యకాలంలోనే పరిచయమయ్యాడు.

అతను నాకు పరిచయం కాకముందు రచయితగా నాకు తెలుసు. అతను అభ్యుదయ భావాలు, సామాజిక స్పృహ, స్త్రీజనాభ్యుదయం గురించి చాలా రచనలు చేశాడు.

ఒకటి రెండు సభలలో అతను నాకు కనిపించాడు. ఆ తరువాత అప్పుడప్పుడు ఉత్తరాలు రాస్తుండేవాడిని, ఆయన శ్రద్ధగా నాకు వుత్తరాలు రాస్తుండేవాడు.

మేము యిద్దరం రెండు నగరాలలో వుంటుంటాం కాబట్టి అరుదుగా కలుసుకోవడం జరుగుతుంది.

ఒకసారి తాను రచనలు రాయటం ఆపేస్తున్నానని వ్రాశాడు.

నేను వీలు కల్పించుకు వెళ్ళాను

నన్ను ఆప్యాయంగా రిసీవ్ చేసుకున్నాడు.

''యిదేనా రావటం?''

''అవును''

''స్నానం చెయ్యండి.''

జగన్నాధంకు యిద్దరు ఆడపిల్లలు. వారికి ఇంకా పెళ్ళికాలేదు. ఒకమ్మాయి టెన్త్ అయి ఏదో షాప్‌లో వుద్యోగం చేస్తుంది. మరో అమ్మాయి చదువుతుంది. కుర్రాడు చదువుతున్నాడు.

ఆస్తి అంతగా లేదు.

అద్దె యిల్లు

యిక జగన్నాధం ఒక ఎలిమెంటరీ స్కూల్లో మాష్టారు.

మాష్టారు కాబట్టే రచన చేయటానికి ఎక్కువ సమయం దొరుకుతుంది.

పైగా అతనింట్లో చిన్నపాటి లైబ్రరీ వుంది.

బుచ్చిబాబు, చలం, గోపిచంద్, జాషువా, కొడవటిగంటి, రావిశాస్త్రి రచనలు బాగా చదువుతూ వుంటాడు. చదవటమే కాదు ఏ పుస్తకంలో యే విషయం వుందో కంటస్థపట్టినట్టు చెపుతాడు.

వారి రచనల ప్రేరణతో నేను రచయితనయ్యానంటాడు.

అలాంటి వాడు రచన ఎందుకు ఆపివేశాడు?

అడిగాను

''ఏమో! నాలాంటివారి సాహిత్యానికి కాలం చెల్లింది.''

''అదేమిటి?''

''అవును''

''అలా ఎందుకంటున్నారు?''

''నాకథలు తిరిగి వచ్చాయి.''

''వాటి?''

''అవును''

''నేను నమ్మను.''

రెండు కథలు నా ముందు వుంచాడు. నేను వాటిని



చూశాను.

చదవకుండానే మీగురించి తెలియనివారు ఎవరో అలా చేసివుంటారు.

''కాలం మారింది.''

''కావచ్చు!''

''రచన విధానం మారింది.''

''అయితే?''

''అభ్యుదయ సాహిత్యానికి నూకలు చెల్లిపోయాయి. అయితే ఈ విషయంలో పత్రికలవారిది తప్పు అనుకోను. పాఠకుల్ని బట్టి పత్రికలు తప్ప పత్రికనిబట్టి పాఠకులు కాదు. గురజాడ ఎవరు అనే ఈ రోజుల్లో జగన్నాధం అభ్యుదయ రచనలు ఎవరికి కావాలి?'' అన్నాడు.

నేను ఒప్పించి లాభం లేదు అనుకున్నాను.

తిరిగి వచ్చాను.

రోజులు గడుస్తున్నాయి.

కొన్ని రోజుల తరువాత వెళ్ళాను.

జగన్నాధం చాలా హుషారుగా వున్నాడు. యింట్లో కొన్ని వస్తువులు కూడా కొన్నాడు. ఆ మార్పు వింతగా కొత్తగా వుంది.

నేను స్నానం ముగించి వచ్చాను.

''వచ్చే నెలలో అమ్మాయిపెళ్ళి'' అన్నాడు.

''చాలా సంతోషం.'' అన్నాను.

ఆరోజు రాత్రి భోజనం తరువాత ఆరుబయట కూర్చున్నాము.

''నేను సంవత్సరం నుండి రచనలు చేస్తున్నాను.'' అన్నాడు.

''ఏమిటి?''

''అవును.''

''మరి నాకు తెలియపర్చలేదే!''

''అంత గొప్ప రచనలు కావు.''

''అంటే-''

''మొదట్లో పేరు కోసం- సమాజానికి ఏదో చెప్పాలనే తాపత్రయంతో వ్రాశాను. కీర్తి శిఖరాల్ని అందుకోకపోయినా మీలాంటి వారిచేత మంచి రచయిత అనిపించుకున్నాను.''

''యిప్పుడు?''

''సమాజ చైతన్యం, అభ్యుదయ రచనలు ఈకాలంలో పనికిరావు''

''ఒకప్పుడన్నారు?''

''అవును.''

''మరీ మీ రచనలు''

క్షణం ఆగాడు ''నా కథలు ప్రచురణ కాలేదు. కుటుంబ సమస్యలు పెరిగాయి. బాధ్యతలు పెరిగాయి. డబ్బు కావాలి''

''నాకు అర్థం కావటంలేదు.''

''ఎవరు ఎలాంటి నవల అడిగినా రాసిస్తున్నాను. శృంగారమా? బీభత్సమా? డిటెక్టివా? ఎడ్వంచరా? ఏదయినా సరే నాకు డబ్బు కావాలి. నా కుటుంబం బ్రతకాలి. నా పేరు యిప్పుడు మోహన్. మోహన్ పేరుతో రాసే రచనలన్నీ నావే. అందులో కొన్ని యింగ్లీషు రొమాంటిక్ నవలల్ని కాపీ చేసి రాస్తున్నాను. బ్రతకాలి.'' అన్నాడు.

నానోట మాట రాలేదు.

అతను అలా మారటానికి కారణం ఎవరు?

నాకు మిగిలిపోయినప్రశ్న

★